సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త
ఎండలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయమే ఉష్ణోగ్రతలు పెరిగి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



వీవోఏల నిరవధిక దీక్షలు
సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు సోమవారం నుంచి నిరవధిక దీక్ష ప్రారంభించారు. వచ్చే నెల సమ్మెకు పిలుపునివ్వగా.. ఇందులో భాగంగా దీక్ష చేపట్టినట్లు తెలిపారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0 /27.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. సాయంత్రం వేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మారుతిప్రసాద్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఏ.మారుతిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ఇటీవల సీడీఎంఏకు అటాచ్ చేసిన మారుతిప్రసాద్‌ను మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం మారుతిప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కమిషనర్ సమావేశం అయ్యారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎర్లీ బర్డ్ స్కీంలో ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించేలా చూడాలని, పన్ను బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ఇంజనీర్ మధుకర్, జేఏవో అనిత, ఏఈలు రాజేందర్, మధు, ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భానుడి భగభగ


నిర్మానుష్యంగా మారిన జన్నారం రహదారి

జన్నారం: వేసవి కాలంలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రతకు జనాలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్లపై జనం కనిపించడం లేదు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతుండగా, ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. జన్నారం మండలంలో ఆది, సోమవారాలు 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దండేపల్లి మండలంలో 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు.

జేపీఎస్‌ల సమ్మె నోటీసు


సమ్మె నోటీస్ అందజేస్తున్న జేపీఎస్‌లు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ప్రొబేషన్ కాలం ముగిసినా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయలేదని పేర్కొన్నారు. పంచాయతీల్లో అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లు ప్రమోట్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వరకు సమ్మె నోటీసులు అందజేస్తామని, సమస్య పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని తెలిపారు.

25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 25 నుంచి మే 4వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

డబుల్ ఆధార్..!



ఒక్కొక్కరికి రెండేసి చొప్పున ఉన్న ఆధార్ కార్డులు

- జిల్లాలో కొందరికి రెండేసి ఆధార్‌కార్డులు
- భూ రిజిస్ట్రేషన్లు, పథకాల కోసం అడ్డదారులు
- కలర్ జిరాక్సులు, ఎడిట్ చేసి మరీ మోసాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దేశ పౌరులకు సమర్థవంతమైన సుపరిపాలన, పారదర్శకమైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కార్డును అమల్లోకి తీసుకొచ్చింది. 2009 నుంచి పౌరుల నివాసం, వ్యక్తిగత వివరాలు డిజిటల్ రూపంలో భద్రపర్చడం, సర్కారు పథకాల్లో సబ్సిడీలు, రాయితీలు తదితరవన్నీ లబ్ధిదారులకే చేరేందుకు ఈ కార్డు ప్రామాణికంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా అన్నింటా ఆధార్ అవసరమవుతోంది. బ్యాంకు, పాన్‌కార్డు, ఓటరు, నివాస, గుర్తింపు కార్డులకు తప్పనిసరిగా మారింది. పౌరుల కంటిపాపలు, వేలిముద్రలతో ఫొటోలతో సహా డిజిటల్ రూపంలో వ్యక్తిగత వివరాలన్నీ నిక్షిప్తం చేస్తున్నారు. ఆ వివరాలు అత్యంత పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రత్యేక చట్టం చేసి అమలు చేస్తున్నారు. అప్పుడే జన్మించిన శిశువు నుంచి వృద్ధుల వరకు అందరికీ అన్ని చోట్ల ఆధార్ కచ్చితంగా మారింది. అవసరమైన వారికి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐఏడీ) ఈ గుర్తింపు కార్డులు అందిస్తోంది.

డూప్లికేట్లతో లబ్ధి
తమ అవసరాల కోసం కొందరు జిల్లాలో రెండేసి ఆ ధార్‌కార్డులు పొందుతున్నారు. కొందరు ఉద్యోగులు, వ్యాపారులు, భూదందాలు చేసేవారు అధికంగా రెండేసి ఆధార్‌కార్డులు తీసుకుంటున్నారు. తమ పేరుతో ఆదాయపన్ను తప్పించుకోవడం కోసమో, ప్రభుత్వ రికార్డుల ఆదాయం తక్కువ చూపించడం, తమ పిల్లలకు సర్కారు ఇచ్చే విద్య, వైద్యంలో రాయి తీ కోసం సృష్టిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలకు ప్రభుత్వ ఉద్యోగాలకు వర్తించవు. దీంతో కొందరు ఉద్యోగులు తమ పేర్లు, ఇంటిపేర్లు మార్చడంతోపాటు బయోమెట్రిక్ కోసం చేతివేళ్లు, కాలి వేళ్లు రెండింటిలో ఏదో ఒకటి ఇస్తూ రెండేసి పొందుతున్నట్లు తెలిసింది. ఇక కొందరికి ఆధార్ మొదటిసారి పొందేటప్పుడు రెండుసార్లు ఎన్‌రోల్ చేసుకున్న వారికి రెండేసి వచ్చిన సంఘటనలు ఉన్నాయి. అవి నేటికీ కొనసాగుతున్నాయి.

అవసరమైన చోట నకిలీ
ఇక కొందరు తమ అసలు పేరుతో కాక నకిలీ ఆధార్‌కార్డులతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో భూలావాదేవీలు జరిపిస్తున్నారు. గతంలో మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారులో నకిలీ ఆధార్‌తో జంగ్ సిపాయి భూమిని తనే వారసుడినని బురిడీ కొట్టించి అమ్మేశా రు. ఇటీవల మంచిర్యాల పట్టణంలో ఓ భూ రిజిస్ట్రేషన్ కోసం నకిలీ ఆధార్‌కార్డు సృష్టించి కలర్ జిరాక్స్ తీసి రిజిస్ట్రేషన్లు చేసేశారు. జైపూర్ మండలంలో ఓ సింగరేణి ఉద్యోగికి, తన భార్య పేరుతో ఇద్దరికి రెండేసి ఆధార్‌కార్డులు ఉన్నాయి. అప్పట్లో పోలీసులకు పట్టుబడిన ఓ దొంగ వద్ద నకిలీ ఆధార్‌కార్డులు లభ్యమయ్యాయి. ఇక కొందరు, పాన్‌కార్డు, వీసా, పాస్‌పోర్టు, కల్యాణలక్ష్మి, షాదీముబా రక్ ఇతర పథకాల సమయంలో అసలు కార్డును పోలినట్లుగా మరొకటి నకిలీ ఆధార్ సృష్టిస్తూ.. కలర్ జిరాక్సులతో అధికారులకు ఆధారాలు సమర్పిస్తున్నారు. వయస్సు తప్పు పడిందని, ఇంటి పేరు తేడా ఉందని, తదితర కారణాలతో ఉన్న అసలు ఆధార్‌ను సరిచేసుకోకపోగా నకిలీవి సృష్టిస్తున్నారు. చాలాచోట్ల ఇలాంటి వాటిని మళ్లీ ఆన్‌లైన్‌లో చెక్ చేయకపోవడంతో వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా పరిశీలిస్తే బయటపడుతున్నాయి. ఇక కొందరు తమ పిల్లల విద్యాభ్యాసం కోసం స్కాలర్‌షిప్‌లు, రుణాలు, బ్యాంక్‌లు, చిట్‌ఫండ్ కంపెనీల్లోనూ నకిలీ ఆధార్ వివరాలు ఇస్తున్నా రు. కొందరు మీ సేవ, కామన్ సర్వీస్ సెంట ర్లలోనే కలర్ జిరాక్సుతో వివరాలు ఎడిట్ చేస్తున్న వారు ఉన్నారు. ఇలాంటి నకిలీ ఆధారాలతో నిజమై న లబ్ధిదారులకు అన్యాయం జరగడమే కాక, ఆధార్ లక్ష్యాన్ని దెబ్బతీసినట్లు అవుతోంది. జిరాక్సు, మీ సేవ, కామన్ సెంటర్లలో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వస్త్రం వచ్చేసింది..

- ఎమ్మార్సీలకు చేరిన స్కూల్ యూనిఫామ్ క్లాత్
- డ్రెస్ మోడల్ మార్చినా కుట్టుకూలి అంతంతే..
- రెండు జతలకు రూ.100 చెల్లింపుపై అసంతృప్తి


మంచిర్యాల ఎమ్మార్సీలో ముడివస్త్రంను పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి చౌదరి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఏకరూప దుస్తులకు సంబంధించిన ముడివస్త్రం జిల్లాకు చేరింది. హైదరాబాద్ టెస్కో నుంచి నేరుగా ఎమ్మార్సీ కేంద్రాలకు చేర్చారు. ఆదివారం 14మండలాల్లోని ఎమ్మార్సీలకు ముడివస్త్రం చేరగా మిగతా నాలుగు మండలాలు హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారానికి సంబంధించిన ముడివస్త్రం రావాల్సి ఉంది. సోమవారం నుంచి ఆయా ఎమ్మార్సీ కార్యాలయాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ముడివస్త్రం పంపిణీ ప్రారంభమైంది. వేసవి సెలవుల్లోనే ప్రధానోపాధ్యాయులు దర్జీని గుర్తించి దుస్తులు కుట్టించాల్సి ఉంది. జిల్లాలో 796 ప్రభుత్వ పాఠశాలల్లో 45,309 మంది విద్యార్థులకు చదువుతున్నారు. వీరికి అవసరమైన 2,32,750 మీటర్ల వస్త్రం అవసరం అవుతుంది.

గిట్టుబాటయ్యేనా..?
ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేస్తారు. ఇందుకు ఒక జతకు రూ.50 దర్జీ కుట్టుకూలి చెల్లించనున్నారు. నామమాత్రం కూలితో డ్రెస్‌లు కుట్టడం సాధ్యమయ్యేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సాధారణంగా ఒక్క డ్రెస్ కుడితే రూ.800 వరకు ఉంది. అలాంటిది రెండు జతలకు రూ.100 కుట్టుకూలి ఎలా సరిపోతుందో అధికారులకే తెలియాలి. ఈ ఏడాది యూనిఫారాల డిజైన్లు మార్చుతూ నిర్ణయించారు. ఒకటి నుంచి మూడో తరగతి బాలికలకు ఫ్రాక్‌లు కుట్టడం, కుడివైపు లోపలికి ఒక పాకెట్, ఎదురు కుచ్చిళ్లు, రెండు ఇంచుల పట్టితో కుట్టించాల్సి ఉంటుంది. ఫ్రాక్‌కు కింద షర్టు క్లాత్‌తో రెండు ఇంచులు వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు, సూటింగ్ క్లాత్‌తో బెల్ట్ కుట్టనున్నారు. షర్టుకు చేతులకు పట్టీలు, చేతులకు క్లిప్పులు షూటింగ్ క్లాత్‌తో వేయాల్సి ఉంటుంది. చేతులకు క్లిప్ పొడవు మూడు ఇంచులు, వెడల్పు ఇంచుతో దుస్తులు డిజైన్ రూపొందించారు. 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు కుట్టడం, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, భుజాలపైన క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులు(హ్యాండ్ లూప్స్) తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి బాలికలకు పంజాబీ డ్రెస్సులు అందజేయాలని నిర్ణయించారు. టాప్, రెండు చేతులకు క్లిప్పులు, పంజాబీ డ్రెస్సు ముందు భాగాన యూ ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేశారు. 1నుంచి 12వ తరగతి వరకు బాలురకు షర్టుకు రెండు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్పులు, భుజాలకు క్లాపులు గుండీతో పెట్టి దుస్తులు కుట్టించాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు. డిజైన్ మార్చినా దర్జీకి చెల్లించే కూలి మాత్రం పెంచకపోవడంపై ప్రధానోపాధ్యాయుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నామమాత్రం ధరలతో..
ప్రభుత్వం నామమాత్రం ధరలు చెల్లిస్తుండడంతో డ్రెస్‌లు కుట్టడంపై అనుమానాలు లేకపోలేదు. గతంలో కూడా చెల్లించిన ధరలతో దర్జీలు గంపగుత్తగా డ్రెస్‌లు కుట్టడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. పొట్టి నెక్కర్లు, అంగీలతోపాటు గుండీలు, కుట్టు ఊడిపోయిన సందర్భాలు అనేకం. కొంతమందికి వదులు దుస్తులు రావడం గమనార్హం. కాగా సర్కారు నామమాత్ర కూలి ఇస్తుండడం వల్ల విద్యాశాఖ అధికారులు కూడా మన్నికపై ఏజెన్సీలను ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. పొదుపు సంఘాలకు ప్రభుత్వం తాజాగా ఏకరూప దుస్తులు కుట్టించే బాధ్యతలను అప్పగించినా గిట్టుబాటు లేకపోవడం.. డ్రెస్‌లు అప్పగించడంలో జాప్యం జరిగింది. ఈ ఏడాది యూనిఫామ్ డిజైన్‌లు మార్చడం.. ధరలు అంతంతే కావడం వల్ల దర్జీ ఏ మేరకు కుట్టిస్తారో చూడాలి.

సమన్వయంతో సమస్యల పరిష్కారం


దివ్యాంగుని వద్ద నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన తండ్రి నుంచి వచ్చిన భూమిని తనకు తెలియకుండా మరొకరి పేరిట పట్టా చేశారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని వేమనపల్లి మండలం ముక్కిడిగూడెం గ్రామానికి చెందిన మేడి మల్లక్క కోరింది. దండేపల్లి మండలం అందుగులపేట శివారు సర్వే నంబరు 49లో 1.20 ఎకరాల భూమి ఉందని, ఇప్పటివరకు పట్టాపాస్‌పుస్తకం రాలేదని ఆ గ్రామానికి చెందిన మొంగని దేవక్క, నాగయ్య తెలిపారు. పట్టాపాస్‌పుస్తకం ఇప్పించాలని కోరింది. పట్టాపాస్ పుస్తకం వచ్చినా ధరణిలో తన పేరు నమోదు చేయలేదని దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన దాసరి శంకరమ్మ విన్నవించింది.

దివ్యాంగుని వద్దకు వచ్చి దరఖాస్తు తీసుకుని
బెల్లంపల్లిలోని వంద పడకల ఆస్పత్రి వద్ద హోటల్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరేందుకు బెల్లంపల్లి మండలం మత్తమమారిగూడేనికి చెందిన దివ్యాంగుడు బైరి సంతోష్ కలెక్టరేట్‌కు వచ్చాడు. మెట్లు ఎక్కలేక కలెక్టరేట్ భవనం ఎదుట రెండు గంటలపాటు వేచి చూశాడు. మధ్యాహ్నం ప్రజావాణి ముగించుకుని వెళ్తున్న కలెక్టర్ సంతోష్ దివ్యాంగుడిని గమనించి అతడి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. రెండు కాళ్లు పని చేయనందున హోటల్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వేడుకున్నాడు.

కరెంటు తొలగించి పంట ఎండబెట్టారు..



పంటల సాగుకు 2006లో కరెంటు డీడీలు తీశామని ఇంతవరకు త్రీఫేస్ కరెంటు లైన్ వేయలేదని భీమిని మండలం చిన్నతిమ్మాపూర్ రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో దహెగాం మండలంలో 70డీడీలు తీశామని, రూ.3.50లక్షలు చెల్లించామని, సింగిల్ ఫేస్ కరెంటుతో మోటార్లు వినియోగిస్తున్నామని, కొద్ది రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు సింగిల్ ఫేస్ కరెంటు తీసేయడంతో 150 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని తెలిపారు. అధికారులను ప్రశ్నిస్తే మళ్లీ డీడీలు రూ.90వేల చొప్పున తీయాలని అంటున్నారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని రైతులు పెర్ల రాజన్న, రాంటెంకి రామయ్య, దుర్గం లింగయ్య, సోమిశెట్టి చంద్రయ్య, వెంకటేష్ పుప్పాల రమేష్, తదితరులు కోరారు.

నా అన్న కొడుకుపై చర్యలు తీసుకోండి



నాకు 80ఏళ్లు. చెవులు సరిగా వినపడవు. నా భార్య తొమ్మిదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. పిల్లలు లేకపోవడంతో అన్న కొడుకు సూరినేని చిరంజీవి కరీంనగర్‌కు తీసుకెళ్లి కొన్ని రోజులు తన వద్దే ఉంచుకున్నాడు. నా వద్ద ఉన్న రూ.3లక్షలు, రెండు తులాల బంగారం తీసుకుని మోసం చేశాడు. పెద్ద మనుషులకు చెబితే రేపు మాపు ఇస్తానని ఇవ్వడం లేదు. తిండికి, దవాఖాన మందులకు పైసలు లేక ఇబ్బంది పడుతున్నాను. నా అన్న కొడుకుపై చర్యలు తీసుకుని డబ్బులు, బంగారం ఇప్పించాలి. పింఛన్ ఇప్పించండి.

– సూరినేని రాజయ్య,
గ్రామం: ద్వారక, మం: దండేపల్లి

ఒత్తిడిని తట్టుకోవడానికి క్రీడలు దోహదం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ


కబడ్డీ ఆడుతున్న కలెక్టర్ సంతోష్

- పోలీసుల వల్లే శాంతిభద్రతలు
- కలెక్టర్ బాదావత్ సంతోష్
- రామగుండం పోలీసు కమిషనరేట్‌లో వార్షిక స్పోర్ట్స్ మీట్

మంచిర్యాలక్రైం: పోలీసులు పని ఒత్తిడిని తట్టుకోవడానికి, శక్తిని ఇవ్వడానికి క్రీడలు దోహదం చేస్తాయని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసులకు సోమవారం గోదావరిఖనిలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కలెక్టర్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, వైభవ్ గైక్వాడ్ శాంతికపోతాలు ఎగురవేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల చొరవ వల్లే శాంతిభద్రతలు ఉన్నాయని, 24గంటలు విధులు నిర్వర్తించే ఉద్యోగం పోలీసు ఒక్కటేనని అన్నారు. సీపీఎం రెమా రాజేశ్వరి మాట్లాడతుతూ పోలీసు ఉద్యోగులకు క్రీడలు ఎంతో అవసరమని, మూడు రోజులపాటు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్‌త్రో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

కబడ్డీ ఆడిన కలెక్టర్
కలెక్టర్ సంతోష్ పోలీసులతో కబడ్డీ ఆడారు. పోలీసు క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కలెక్టర్ తాను చదువుకున్న రోజుల్లో ఆడిన ఆటలను గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ కబడ్డీ ఆటతీరు చూసి అందరూ ఉత్సాహపరుస్తూ ఆనందించారు.

ఉత్తమ పారిశ్రామిక వేత్తకు కలెక్టర్ అభినందన


పారిశ్రామిక వేత్తను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉత్తమ పారిశ్రామిక వేత్త అవార్డు అందుకున్న నీలిమా ఇండస్ట్రీస్ యాజమాని చిటూరి మల్లేష్‌ను కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి అనుబంధ పరిశ్రమగా రామకృష్ణాపూర్ నీలిమా ఇండస్ట్రీ ద్వారా రూఫ్‌బోల్ట్, రోలర్స్, కన్వేయర్ బెల్ట్స్, జీఐ వైర్, నట్టులు తదితర సింగరేణిలో ఉపయోగించే పరికరాలను నాణ్యతతో తయారు చేసి మెరుగైన సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలువడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లాలో మరిన్ని ఇండస్ట్రీలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రీయల్ అధికారి రఘు, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ అధికారి అశోక్, దినేష్ పాల్గొన్నారు.

అక్రమ రవాణా.. అక్కరకు రాని రీచ్..!

- అడ్డదారిలో తరలిపోతున్న ఇసుక
- బుకింగ్‌లు లేని ఇసుక రీచ్


వేంపల్లి గోదావరి తీరాన వెలవెలబోతున్న ఇసుక రీచ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఇసుక రీచ్ బుకింగ్‌లు లేక వెలవెలబోతోంది. మరోవైపు ఇసుక అక్రమంగా తరలిపోతోంది. నెల రోజుల క్రితం ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జెండా ఊపి ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. మైనింగ్ శాఖ ఆన్‌లైన్ ద్వారా బుకింగ్‌లు చేపడుతుండగా.. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఇసుక రీచ్ నిర్వహణ సాగుతోంది. హాజీపూర్, మంచిర్యాల, మందమర్రి, నస్పూర్, లక్సెట్టిపేట, దండేపల్లి ప్రాంతాల చెందిన సుమారు వెయ్యి ట్రాక్టర్లు మన ఇసుక–మన వాహనం కింద రిజిష్టర్ అయి ఉన్నాయి. ఇసుక రీచ్ వరకు రోడ్డు, కల్వర్టు ఏర్పాటుకు వేంపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో రూ.15లక్షల వ్యయం చేశారు. మొదట్లో 300 ట్రిప్పుల వరకు బుకింగ్ జరిగేది. ఇప్పటివరకు పంచాయతీకి మైనింగ్ శాఖ ద్వారా రూ.2లక్షల వరకు జమ అయ్యాయి. బుకింగ్‌లు వందకు పడిపోగా సోమవారం ఒక్కటీ బుకింగ్ కాలేదు. దీంతో ఇసుక రీచ్ అలంకార ప్రాయంగా మారుతోంది.

అర్ధరాత్రి అక్రమంగా తరలింపు
ముల్కల్ల, గుడిపేట ఇసుక రీచ్‌లకు గతంలో రోజుకు 1500 వరకు బుకింగ్లు జరిగేవి. మంచిర్యాల, పాత మంచిర్యాలలో అర్ధరాత్రి అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా సాగుతుండడంతో బుకింగ్‌లు కావడం లేదనే ఆరోపణలున్నాయి. పట్టణ శివారులోని గోదావరి నది నుంచి ఇసుక తరలించి ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.2వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇసుక రీచ్ ద్వారా రూ.2,300 వరకు ట్రిప్పు పడుతుండగా.. అనధికారికంగా ఇసుక ట్రిప్పు రూ.1,500కే లభిస్తోంది. అధికారిక రీచ్‌లో బుకింగ్ చేస్తే రోజులో ఒక్క ట్రిప్పు మాత్రమే దొరుకుతుంది. అడ్డదారిలో వెళ్తే రూ.500 ఖర్చుతో అర్ధరాత్రిలో ఏకంగా నాలుగు ట్రిప్పుల వరకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

దుబ్బగూడెం నిర్వాసితులపై నిర్లక్ష్యం

కాసిపేట: మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్ కాస్టు దుబ్బగూడెం నిర్వాసితులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ.గుణ విమర్శించారు. సోమవారం మండలంలోని దుబ్బగూడెంలో గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓసీలో బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు పగుళ్లు వచ్చాయని, ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. పెద్దనపల్లి శివారులో లేఅవుట్ చేసిన ప్లాట్లు అలాట్ చేయకపోవడం, అభివృద్ధి పనులు పూర్తిచేయక పోవడంతో అక్కడికి వెళ్లలేని, ఇక్కడ ఉండలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బోడ్డు వినోద, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులను చూపిస్తున్న సీఐ

భీమారం(చెన్నూర్): గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం నెన్నల మండలం కొత్తూరు నుంచి భీమారం ప్రధాన రహదారి వెంట పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనాలపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 10 లీటర్ల గుడుంబా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. గుడుంబా, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరుకు చెందిన నిందితులు ఇస్లావత్ రాజేశ్, ఇస్లావత్ రవిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై జీవన్ రెడ్డి, సిబ్బంది రాజేంద్రప్రసాద్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని గొడవెల్లికి వెళ్లే మార్గంలో సోమవారం పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. సంఘటన సమయానికి సమీపంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఈ రోడ్డుమార్గం గుండా పయనిస్తారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



కాలిపోయిన నగదు

కౌటాల(సిర్పూర్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న లేడీస్ ఎంపోరియం, జనరల్ స్టోర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు వినోద్ జైస్వాల్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం కౌటాలలో వారసంత కావడంతో ఉదయం 4 గంటలకు షాప్‌లోని ఫ్రిజ్ ఆన్‌చేసి వెళ్లిపోయాడు. షార్ట్‌సర్క్యూట్‌తో ఉదయం 6 గంటల ప్రాంతంలో దుకాణంలోంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.35 వేల నగదుతో పాటు ఫ్రిజ్, రూ.2.50 లక్షల విలువైన అలంకరణ సామగ్రి కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులు సందర్శించి వివరాలు సేకరించారు.



వడదెబ్బ... తస్మాత్ జాగ్రత్త

- అత్యధికంగా నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం

మంచిర్యాలటౌన్/నిర్మల్‌చైన్‌గేట్: ఏప్రిల్ మాసంలోనే భానుడు భగ్గుమంటుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇప్పుడే 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే మాసంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ అంటే..

ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైతే శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడడాన్ని వడదెబ్బ అంటారు. వేడి వాతావరణం లేదా చురుకైన పనులతో కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలతో శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తుంది.

లక్షణాలు

వడదెబ్బ తాకిన వారి కాళ్లు వాపులు వస్తాయి. కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స



- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగిని సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

బారిన పడకుండా ఉండాలంటే...



- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడలో ఉండేందుకు ప్రయత్నించండి.
- గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సమస్యలు ఉన్నవారి శరీరాలకు అధిక సూర్యరశ్మి ప్రభావించి శరీరం త్వరగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. దీంతో వ్యాధి తీవ్రతలు అధికంగా ఉంటాయి.
- ఆల్కహాల్, సిగరేట్, కార్బోనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్‌గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించాలి.
- వేసవిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. కారం, మసాలాలు లేకుంటే ఉత్తమం.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ ద్రావణాలను తాగడం మంచిది.

రోజుకు ఎనిమిది లీటర్ల నీరు తాగాలి

వేసవిలో రోజుకు ఎనిమిది లీటర్లకు తక్కువ కాకుండా నీటిని తాగాలి. తెల్లని కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్న వారు ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాలంటే తలకు టోపీ, తల పాగా ధరించాలి. వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

– డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజీషియన్, నిర్మల్

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో బయట ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగవద్దు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్న ఆహారం మాత్రమే తినడం మంచిది.
- ఆహారంలో మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.

జాగ్రత్తలు



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపీ ధరించి వెళ్లాలి. కొబ్బరి నీరు, ఉప్పు, చక్కెర, నిమ్మరసం కలిపిన నీటిని తాగాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాం. నవజాత శిశువులను పల్చటి గుడ్డతో సగం వరకు కప్పి ఉంచాలి. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, మంచిర్యాల జిల్లా వైద్యాధికారి

నీటిశాతం ఎక్కువగా ఉండే ఆహారం మేలు..



- నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటిశాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగానూ దాహం ఎక్కువగానూ ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

తేలికపాటి ఆహారం ఉత్తమం

వేసవిలో సాధ్యమైనంత వరకు నూనెతో తయారు చేసిన పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, జంక్‌ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. తేలికపాటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిల్లలను బయటకు పంపించవద్దు. వేసవి వేడిని తట్టుకునేందుకు నూనెలేని, తేలికపాటి ఆహారాన్ని పిల్లలకు అందించాలి. డీఫ్రిజ్‌లో ఉంచిన వాటిని వెంటనే తినడం, తాగడం వంటివి చేయవద్దు. సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం చల్లగా ఉన్న వాటిని మాత్రమే తీసుకోవాలి. బాగా చల్లగా ఉన్న నీరు తాగడం వల్ల తిన్న ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కూల్ డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.



రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సుదమళ్ల హరికృష్ణ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, స్పోర్ట్స్‌చైర్మన్ ఆంజనేయులుగౌడ్ చేతుల మీదుగా పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుపాక శ్రీలత, సభ్యులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న అశ్విని

జైపూర్(చెన్నూర్): కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుందారం గ్రామానికి చెందిన సజ్జనపు రమాదేవి, బాపు దంపతుల కుమార్తె అశ్వినికి శ్రీరాంపూర్‌కు చెందిన ధరణి శివకుమార్‌తో మే 3న వివాహం జరిపించేందుకు ఇరుకుటుంబాల పెద్దలు నిశ్చయించారు. పెళ్లి షాపింగ్ చేసేందుకు అశ్విని, శివకుమార్ కారులో మంచిర్యాలకు బయలుదేరారు. జైపూర్ మండలం నర్సింగాపూర్(ఎస్) బస్టాండ్ సమీపంలోకి వెళ్లగానే కారు అదుపుతప్పి పక్కనున్న వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఇరువురికి గాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అశ్విని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఈ నెల 15న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన బాల్తు రాజయ్య(51) కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం ..రాజయ్య ఉపాధి నిమిత్తం రూ.2లక్షలు అప్పు చేసి దుబాయ్ వెళ్లాడు. సరైన ఉపాధి లేక స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. మరో రూ.3 లక్షలు అప్పుచేసి కూతురు వివాహం చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య తిరుమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తీగల సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా రాచకొండ అనిల్, కార్యదర్శిగా కలవేని సమ్మయ్య, సహాయ కార్యదర్శి పైడకుల రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా తాండ్ర జంపయ్య, వెంకటస్వామి, కోశాధికారిగా వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్

ఉట్నూర్(ఖానాపూర్): గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 38 అర్జీలు స్వీకరించారు. ఇందులో అటవీ హక్కుపత్రాలు, డబుల్ బెడ్రూం, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగం అధికారులు పరిశీలించి సత్వరం న్యాయం చేయాలన్నారు. వేసవికాలంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణకు ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశం కల్పించాలని నెన్నెల మండలం జంగల్‌పేట్‌కు చెందిన శ్రీదేవి అర్జీ పెట్టుకుంది.
- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా టెంట్ హౌజ్ పెట్టుకోవడానికి రుణం అందించాలని భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన ఆత్రం మోతీరాం విన్నవించాడు.
- ఉట్నూర్ మండలం చోప్పనికుంట గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని టేకం తుకారాం వేడుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా తమ పంట పొలంలో బోరు ఏర్పాటు, మోటార్ మంజూరు చేయాలని గాదిగూడ మండలం అర్జునికి చెందిన మోతుబాయి అర్జీ పెట్టుకుంది.
- తనకు పింఛన్ ఇప్పించాలని జైనూర్ మండలం రాశిమెట్టకు చెందిన జుగాదిరావ్ వేడుకున్నాడు.

ఓసీపీల్లో షిఫ్ట్ వేళలు మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేసవికాలంలో ఎండల తీవ్రత దృశ్యా శ్రీరాంపూర్ ఓసీపీల్లో షిఫ్ట్ వేళలు మార్చాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ నేతలు ఓసీపీ మేనేజర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య మాట్లాడుతూ ఓపెన్‌కాస్టులో పగటి ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరాయన్నారు. దీంతో ఫస్ట్ షిఫ్ట్, సెకండ్ షిఫ్ట్‌లో పనిచేసే వారు ఎండవేడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండడంతో షిఫ్ట్ వేళలు మార్చాలని కోరారు. మొదటి షిఫ్ట్‌ను ఉదయం 5 నుంచి 11 గంటల వరకు, రెండోషిఫ్ట్‌ను సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు నడిపించాలని కోరారు. వేడిని తగ్గించేందుకు ఓసీపీ క్వారీలో ట్యాంకర్ల ద్వారా నీటిని పిచికారీ చేయించాలని, పనిస్థలాల వద్ద మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, క్యాంటీన్లలో పెరుగన్నం అందించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రమోహన్, ఏరియా కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, పిట్ సెక్రటరీ మోహన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రావు, ఏవీఎస్ శాస్త్రి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీల్లో పనివేళలు మార్చాలి

మందమర్రిరూరల్(చెన్నూర్): ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఓసీపీలో పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–ఓసీని సందర్శించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఈ నెల 14న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం ఒడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల అనిల్(22) ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గ్రామానికి చెందిన దారంగుల రాజమౌళి కూతుర్ని ప్రేమించాడు. విషయం యువతి తండ్రికి తెలియడంతో ఈ నెల 14న అనిల్‌ను మోదెల శివారులోని టేకుచెట్ల వద్దకు పిలిపించి బెదిరించాడు. దీంతో యువకుడు బీరులో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపాడు.

కేకే–ఓసీని సందర్శించిన ఆడిట్ కమిటీ



కేకే ఓసీని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీని సోమవారం ప్రీ మాన్సూన్ (రుతుపవనాల వలన సంభవించే అనర్థాల నివారణ) ఆడిట్ కమిటీ సభ్యులు సందర్శించారు. ప్లాన్స్, ట్రెంచెస్, పంప్స్, సుద్దాల వాగు, వాటర్ మానిటరింగ్ పాయింట్, కాసినేట బ్రిడ్జి, క్వారీలో ప్రమాదకర నీటిని తనిఖీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సందర్శించిన వారిలో సభ్యులు వెంకటరమణ, (డీజీఎం), జైనాలుద్దీన్ (ఏరియా సేఫ్టీ ఆఫీసర్), పీవీఎస్ పద్మరాజు, ఓదెలు, కేకే–ఓసీ ప్రాజెక్ట్ అధికారి రమేష్, మేనేజర్ డీపీ కుష్వా ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. మూడు రోజులుగా సీసీసీలోని సింగరేణి ఎస్సీవోఏ క్లబ్‌లో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా, ధ్యాన శిక్షణ తరగతులు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా రామచంద్ర మిషన్ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



ప్రవళిక మృతదేహం

బెల్లంపల్లి: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కన్నాలబస్తీలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన ప్రవళిక(24)కు కన్నాలబస్తీకి చెందిన అపరాద సతీష్‌తో 10 నెలలక్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సైతం దంపతులు గొడవపడ్డారు. దీంతో ఇంట్లో అందరూ ఉండగానే ప్రవళిక బెడ్‌రూమ్‌కు వెళ్లి తలుపులు వేసుకుంది. కుటుంబ సభ్యులు ఇరుగు పొరుగువారిని పిలిచి బలవంతంగా తలుపులు తీసి లోనికి వెళ్లిచూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. కాగా భార్యాభర్తల మధ్య గొడవలకు కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. మృతురాలి తల్లిదండ్రులు వస్తే కానీ పూర్తి వివరాలు తెలిసే అవకాశాలు లేవు. ఘటనాస్థలిని వన్‌టౌన్ ఏఎస్సై తిరుపతి సందర్శించి ప్రాథమిక సమాచారం సేకరించారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



అనిరుధ్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని చింతపల్లికి చెందిన గడ్డం అనిరుధ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న అనిరుధ్ గతనెల 31న ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని 1నుంచి 100 వరకు గల స్క్వేర్స్(వర్గాలు)ను 2 నిమిషాల 34 సెకండ్లలో అత్యంత వేగంగా రాసి ఇంటర్నేషనల్ బుక్‌ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు.